www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 30 నవంబర్ 2025

అభివృద్ధికి ప్రాణం పోసిన ప్రభుత్వం : మంత్రి

ప్రజాశక్తి - రాయచోటి

గత వైసిపి ప్రభుత్వ హయాంలో అన్నమయ్య జిల్లాలో చేసిన అభివృద్ధి శూన్యమని, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాణం పోసిందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభివృద్ధిని ఏమాత్రం కృషి చేయని వైసిపి నాయకులకు ప్రజలు గత ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పినా బుద్ధి రావడం లేదన్నారు. అభివృద్ధి చేతకానితనం శూన్య మాటలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఇంకా మానుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నమయ్య జిల్లాలో అభివృద్ధిని పరుగులు పెట్టించామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రులు, ఎమ్మెల్యేలుగా పని చేసిన వారు, వారి అనుచరులు 30 వేల ఎకరాల ప్రభుత్వ భూములను కొల్లేశారని, విషయాన్ని నిగ్గు తేల్చి ప్రజల ముందు ఉంచామని తెలిపారు. జిల్లా కేంద్రం పేరు చెప్పుకుని చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములను కొల్లేసిన ఘనత మీకు దక్కిందన్నారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటు సమయంలో శాస్త్రీయంగా చేసి ఉంటే ఈరోజు మదనపల్లె జిల్లా ఏర్పాటు అయ్యేది కాదని పేర్కొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..
కడప బాలోత్సవం

- వివిధ పోటీల్లో ఆసక్తిగా పాల్గొన్న విద్యార్థులు
- కడప ఉమ్మడి జిల్లా నుంచి మొదటి రోజు 7 వేల మంది హాజరు
- ఆకట్టుకున్న సాంస్కృతిక, క్రీడా పోటీలు
- విజేతలకు ప్రముఖులచే బహుమతులు ప్రదానం

హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

నృత్య పోటీల్లో విద్యార్థులు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో కడప బాలోత్సవం 3.0 ఉత్సాహంగా, ఉల్లాసంగా ప్రారంభమైంది. బాలల పండుగకు మరియాపురం బాలికల పాఠశాలలోని సి రామన్ విజ్ఞాన ప్రాంగణం వేదికైంది. వేలాదిమంది విద్యార్థులు కార్యక్రమాన్ని ఉత్సాహంగా హాజరయ్యారు. ముఖ్యంగా ఉమ్మడి కడప జిల్లాల నుంచి వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు దాదాపు 14 వేల మంది రెండు రోజులు పాటు నిర్వహించే ఈ బాలోత్సవంలో భాగస్వాములు కానున్నారు. వీరందరూ వివిధ విజ్ఞాన, నృత్య క్రీడా పోటీల్లో ఆసక్తిగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించుకున్నారు. వీరి ప్రదర్శన కోసం ప్రాంగణంలో ప్రత్యేకంగా నాలుగు స్టేజీలను ఏర్పాటుచేశారు. జానపదనృత్యం, బృంద గాన పోటీలు, దేశభక్తి పాటల పోటీలు, మట్టి బొమ్మల తయారీల పోటీలు, ఇంకా జూనియర్, సీనియర్లకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, కథారచన మొదలైన అంశాలపై పోటీలు కూడా సమాంతరంగా నిర్వహించారు. బాలోత్సవం పండగ పిల్లలో ఉన్న సృజనాత్మక శక్తిని, భావ వికాసాన్ని పెంపొందించడానికి తోడ్పడుతుందని చెప్పవచ్చు. కార్యక్రమం ముచ్చటగా మూడోసారి నిర్వహిస్తున్నారు. కార్యక్రమ నిర్వహణ కోసం దాదాపు 500 మంది వాలంటీర్లు పనిచేస్తున్నారు. చాలామంది టీచర్లు, రిటైర్ అయిన ఉద్యోగులు, ఇంజినీరింగ్ కాలేజ్ విద్యార్థులు, ఇతర సామాజిక కార్యకర్తలు చాలామంది ఇందులో స్వచ్ఛందంగా భాగస్వాములయ్యారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి పోలీసు యంత్రాంగం, మున్సిపల్ సేవల యంత్రాంగం తోడ్పాటును అందిస్తున్నారు.

ఈ సందర్భంగా బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ బాలోత్సవం అందరి తోడ్పాటుతో నడుస్తుందన్నారు. ఇందులో వివిధ పాఠశాలలు, కళాశాలలో హార్థికంగా, ఆర్థికంగా చేయూతనిస్తున్నాయని తెలిపారు. చాలామంది దాతృత్వ, ఇంజనీర్లు, రాజకీయ నాయకులు ఈ కార్యక్రమానికి అండదండగా నిలుస్తున్నారని చెప్పారు. ఇందులో అన్నమయ్య కళావేదిక, కమ్యుత్రి మొల్ల కళావేదిక, వేమన కళావేదిక, బ్రౌన్ శాస్త్రి, డాక్టర్ మంజూమియా కళావేదిక ఇలా నాలుగు వేదికలలో వివిధ కళారూపాలను బాలలు ప్రదర్శిస్తున్నారు. సైన్స్ ప్రయోగాల పోటీలు ఉన్నాయని తెలిపారు.

బాలోత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు నాగమని రెడ్డి మాట్లాడుతూ పిల్లల పండుగకు చాలామంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని జయప్రదం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇది రెండు రోజులు పాటు నిర్వహించే బాలోత్సవంలో మొదటి రోజే దాదాపు 7 వేల మంది విద్యార్థులు రిజిస్టర్ అయ్యారని చెప్పారు. వారికి భోజన సదుపాయాన్ని కమిటీ అందజేస్తుందని తెలిపారు.

బాలోత్సవ కమిటీ అధ్యక్షులు గుర్రాల గోపాల్ మాట్లాడుతూ కార్యక్రమంలో పాల్గొనడానికి ఎలాంటి ఎంట్రీ ఫీజు పెట్టలేదన్నారు. విద్యార్థులలో ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీయడమే ప్రధాన లక్ష్యం, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులందరికీ భాగస్వామ్యం కల్పించామని చెప్పారు. సాంస్కృతిక రంగంలో ఖవ్వాలి, ఉర్దూ విద్యార్థులకు ఉర్దూ భాషలోనే పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ఇంగ్లీషు భాషలోనే పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. మట్టి బొమ్మల తయారీ పోటీలు, ఏకపాత్రాభినయం, పాటల పోటీలు, ఖతా రచన పోటీలు, కథలు చెప్పే పోటీలు, ఇలా రకరకాల అంశాలలో విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీస్తున్నామని అన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను కడప జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు, సమాజ సేవకులు చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి అందజేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇలాంటి పిల్లల పండుగకు తమ సహాయ సహకారాలను అందజేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. తన వంతు తోడ్పాటును అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాయకులు మహేష్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ తవ్వా సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం, సమతా విభాగం కన్వీనర్ సునీత, బుద్ధిష్ట్ కల్చరల్ సొసైటీ అధ్యక్షులు పిళ్లా కుమారస్వామి రెడ్డి,యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి, యోగి వేమన ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మల్లికార్జున రావు, యూనివర్సిటీ విద్యార్థులు, ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యా ర్థులు, ఎస్వీ ఇంజినీరింగ్ కాలేజ్ విద్యార్థులు, వాలంటీర్లుగా స్వచ్ఛందంగా పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి హాజరై పాల్గొని బహుమతుల ప్రదానం చేశారు.

కోలాటం ఆడుతున్న చిన్నారులు

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

పిల్లలు ఉదయిస్తున్న సూర్యులు
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్ : పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో, పరిసరాలను పరిశీలిస్తూ, ప్రకృతిని ఆస్వాదిస్తూ ఎదగడం ద్వారా సృజనాత్మకత, శాస్త్రీయత సమాజం పట్ల బాధ్యత ఏర్పడతాయని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం సెయింట్ జోసెఫ్ బాలికల ఉన్నత పాఠశాలలో మరియాపురంలో నిర్వహించిన కడప జిల్లా మూడవ బాలోత్సవానికి విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన లభించింది. బాలోత్సవ సభలో ఎన్..వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చెడ్డ పిల్లలంటూ ఎవరూ ఉండరని, పిల్లలు సమాజంలో భాగంగా ఉంటారని, సమాజంలో ఉన్న అవలక్షణాలను చూసి తప్పులు చేయటం అలవాటు పడతారని తెలిపారు. ర్యాంకులు, పోటీతత్వం కాకుండా సృజనాత్మకతను పెంచి వారి ఇష్టా ఇష్టాలు కనుగుణంగా చదువుకునే అవకాశాన్ని పెద్దలు కల్పించాలని కోరారు. కడప బాలోత్సవాల నిర్వహిస్తున్న బాలోత్సవ కమిటీకి యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ అభినందనలు తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి నీటి బొట్టు వృథా కానివ్వం
- కలెక్టర్ నిశాంత్ కుమార్

సప్లై ఛానల్స్ పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-రామాపురం

జిల్లాలో పడే ప్రతి నీటిబొట్టును వృథా కానివ్వకుండా సప్లై చానల్స్ ద్వారా చెరువులు నింపే ప్రక్రియను పూర్తి చేయాలని నీటిపారుదల, వెలిగల్లు ప్రాజెక్టు అధికారులకు కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ బి.రాచపల్లి గ్రామ పరిధిలోని రామరాజువంక నుండి బల్లిగుట్ట చెరువు సప్లై ఛానల్ పనులను, రామరాజువంక చెక్ డాం నిర్మాణానికి సంబంధించిన పనులను, రామరాజువంక నుండి ఓబుల్‌రెడ్డి చెరువు, కసిరెడ్డి చెరువుకు, దిగువ చింతలవారికుంట, చింతకుంట నింపే సప్లై ఛానల్ పనులను కలెక్టర్ స్వయంగా పరిశీలించి దీనికి సంబంధించిన పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని రానున్న వర్షాకాలంలో నీటిని వృథాగా పోనికుండా చెరువులు అన్ని నింపే ప్రక్రియ పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సప్లై ఛానల్ ద్వారా చెరువులు నీరు నింపడం వలన బల్లగుట్టపల్లి చెరువు ద్వారా దాదాపు 225 ఎకరాలకు, కసిరెడ్డి చెరువు, ఓబుల్ రెడ్డి చెరువు ద్వారా దాదాపు 109 ఎకరాలకు నీరు అందించడం జరుగుతుందన్నారు. రామాపురం, లక్కిరెడ్డిపల్లి మండలాలలో ప్రతి చెరువు నీరు నింపే విధంగా సప్లై ఛానల్ పనులు చేపట్టే విధంగా ప్రణాళికలను తయారు చేసి నివేదికలు సమర్పించాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ పదవి విరమణ చేయనున్న నీటిపారుదల శాఖ ఎస్ఇ వెంకటరామయ్యకు కలెక్టర్ పూల మొక్కను అందించి శాలువాతో సన్మానించారు. ఈ జిల్లాకు తాను వచ్చిన కొంత కాలంలోనే వెంకటరామయ్య సరైన సహకారం తోడ్పాటు, సలహాలు, సూచనలు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎఇఇ వెంకటరామయ్య, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ జుషువా, ఎఇ బాషా, విఆర్ఒలు, విఆర్ఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి
- ఎఐసిసి పరిశీలకులు మహేంద్ర

మాట్లాడుతున్న ఎఐసిసి పరిశీలకులు మహేంద్ర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు 2029 ఎన్నికల్లో విజయానికి ఇప్పటి నుండే అడుగులు వేద్దామని ఎఐసిసి పరిశీలకులు మహేంద్ర పేర్కొన్నారు. శనివారం స్థానిక జెసిఎం కమ్యూనిటీ హాల్‌లో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మల్లెల పవన్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా మహిళా అధ్యక్షులు నిగార్ సుల్తాన అధ్యక్షతన పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి ఎఐసిసి ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. డిసిసి అధ్యక్షులు ఎంపిక కోసం పారదర్శకంగా పార్టీలో అందరి అభిప్రాయాలను సేకరించి, నివేదికను రాహుల్ గాంధీకి అందజేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన ప్రతిపక్ష వైసిపి అన్నీ బిజెపి ఏజెంట్లే పార్టీలేనని విమర్శించారు. 2029 శాసనసభ ఎన్నికలకు కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లెల పవన్ కుమార్‌రెడ్డేనని వెల్లడించారు. ఎఐసిసి సెక్రటరీ గణేష్ యాదవ్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ లేని రాష్ట్రం కానీ గ్రామం కానీ లేదన్నారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పార్టీ ఎలా ఉందో, తిరిగి బలోపేతం చేయడమే తమ లక్ష్యమన్నారు. డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్ మాట్లాడుతూ ఇకపై నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటారని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన నిలబడి పోరాడుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.కె.బాషా, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు రెడ్డి సాహెబ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొండుపల్లి ఆనంద్, ఒబిసి చైర్మన్ ఆవుల అది, మీనా కుమారి, కలిచెర్ల మస్తాన్‌రెడ్డి, ముబారక్‌ఖాన్, ఖాదర్‌బాషా, మహబూబ్‌పీర్, మహమ్మద్‌అలీ, మహమ్మద్ రఫీ, ఈశ్వరమ్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి : ఆర్‌టిఒ

ప్రజాశక్తి - రాయచోటి

మోటారు వాహన చట్టం 1988లోని నిబంధనలు పాటించని విద్యా సంస్థల బస్సులపై కట్టిన చర్యలు తీసుకుంటున్నామని, ఇఐబిలను స్వాధీనం చేసుకుంటామని జిల్లా రవాణా శాఖ అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర రవాణా కమిషనర్ సూచనల మేరకు, అన్నమయ్య జిల్లా రవాణా శాఖ శుక్రవారం విద్యా సంస్థ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిందని పేర్కొన్నారు. ఈ తనిఖీలో భాగంగా, 75 ఇఐబిలను తనిఖీ చేసి భద్రతా నిబంధనలను పాటించనందుకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. పర్మిట్ లేని ఒక ఇఐబిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మోటారు వాహన చట్టం, 1988, దాని కింద రూపొందించిన నిబంధనల ప్రకారం వారి బస్సుల భద్రతా నిబంధనలను పాటించాలని అన్ని విద్యా సంస్థల యాజమాన్యాలకు తెలిపామని పేర్కొన్నారు. పర్మిట్, ఫిట్‌నెస్, బీమా, పన్ను, డ్రైవింగ్ లైసెన్స్ లేని ఐఐపిలను స్వాధీనం చేసుకుంటామన్నారు. ఇఐబి డ్రైవర్ వయస్సు 60 సంవత్సరాలు మించకూడదని, డ్రైవర్‌కు 5 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. విద్యార్థుల భద్రత కోసం ఈఐబిలు సరైన అగ్నిమాపక వ్యవస్థలు, అగ్నిమాపక యంత్రాలను నిర్వహించాలని సూచించారు. మోటారు వాహనాల చట్టం, 1988ని ఉల్లంఘించే ఈఐబిలను చట్ట ప్రకారం నిబంధనల మేరకు అదుపులోకి తీసుకుంటామన్నారు.

ప్రజలకు చేరువగా బ్యాంక్ సేవలు : చైర్మన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అధిక వడ్డీలు, జమీందారు వ్యవస్థ నడిచే రోజుల్లో చిన్నస్థాయి, మధ్యతరగతి కుటుంబాలకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో 1924లో గంగారపు పెద్దప్ప రెడ్డప్పరెడ్డి కొంతమంది ఖాతాదారులతో డిపాజిట్ రూపంలో మదనపల్లి కో-ఆపరేటివ్ బ్యాంకును స్థాపించారని బ్యాంకు చైర్మన్ నాదెండ్ల విద్యాసాగర్ తెలిపారు. శనివారం స్థానిక ఎన్‌విఆర్ కన్వెన్షన్ హాల్‌లో బ్యాంకు డైరెక్టర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిసెంబర్ 3న శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాష, పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. బ్యాంకు షేర్ హోల్డర్స్, డిపాజిటర్లు, ఖాతాదారులు, శ్రేయోభిలాషులు ప్రజలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ మహర్షి, డైరెక్టర్లు జోళపాళ్యం మహేంద్ర, సోము, ఆకుల కృష్ణమూర్తి, పసుపు రవి, సత్తార్, నిరంజన్ కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

చర్చకు రాని అజెండా అంశాలు
- అర్థాంతరంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మున్సిపల్ సాధారణ సమావేశంలో అజెండా అంశాలు చర్చించకుండానే అర్థాంతరంగా సమావేశాన్ని ముగించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ మనూజ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశం ప్రారంభమైన వెంటనే కౌన్సిలర్లు గాంధీ, తులసి రామకృష్ణ, కరీముల్లా మదనపల్లె జిల్లా అయిన సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు కృతజ్ఞతలు తెలియజేయాలని పట్టుబట్టారు. మొదట అజెండాలోని అంశాలు చర్చిద్దామని, ఆ తరువాత మిగతా విషయాలపై చర్చిద్దామని 6వ వార్డ్ కౌన్సిలర్ ప్రసాద్ బాబు సభ దృష్టికి తెచ్చారు. టిడిపి కౌన్సిలర్ తులసి రామకృష్ణ మాత్రం కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు కృతజ్ఞతలు తెలియజేసిన తర్వాతే మిగతా విషయాలను మాట్లాడుదామని పట్టుబట్టారు. కౌన్సిల్ ఆమోదం లేకపోవడంతో సభ నుండి వెళ్లిపోయారు. ఆ వెంటనే మరో కౌన్సిలర్ మార్పురి నాగార్జున కూడా కౌన్సిల్ హాల్ నుండి వెళ్లిపోయారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ మాట్లాడుతూ సభలో అన్ని విషయాలు చర్చించడం జరుగుతుందని, ముందుగా అజెండాలోని అంశాలకు ఆమోదం తెలపాలన్నారు. చలికాలం ప్రారంభం అయినందున పట్టణంలో డెంగీ, మలేరియా వంటి రోగాలు రాకుండా పట్టణంలో పారిశుధ్య కార్మికులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని శానిటేషన్ డిపార్ట్మెంట్‌ను ఆదేశించారు. అనంతరం వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతి అజెండాలోని నాలుగో అంశం రద్దు చేయాలని కోరడంతో కౌన్సిలర్ కరీముల్లా జోక్యం చేసుకొని అజెండాలోని అంశాలు ఏవి చదవకుండా రద్దు చేయమనడం ఎంతవరకు సమంజసమన్నారు. కౌన్సిలర్ ఖాజా కలుగ జేసుకొని వైసిపిలో ఉన్న కౌన్సిలర్లు టిడిపిలోకి వెళ్లి కౌన్సిల్ సమావేశం జరగనీయకుండా అడ్డుపడుతున్నారంటూ ఆవేశంగా మాట్లాడారు. ఇలా అజెండా లోని అంశాలు చర్చించకుండానే కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశం నుండి వెళ్లిపోవడంతో సభ అర్థాంతరంగా ముగిసింది.

4వ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

జిల్లా ఎపి ప్రభుత్వం నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం పట్టణంలోని ఎన్‌జిఒ సభా భవనంలో నిర్వహించిన జిల్లా 4వ తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కడప జిల్లా ఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షులు బి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ప్రసాద్ యాదవ్, అన్నమయ్య జిల్లా చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికను నిర్వహించారు. అధ్యక్షులు కె.కె.లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా పి. నవీన్ కుమార్, కోశాధికారిగా కె.సుఖసాగర్, సహాధ్యక్షులుగా ఎన్. వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా జి.గంగాధర్, ఎస్.ఖాదర్‌బాషా, జె.ఉమాదేవి, సంయుక్త కార్యదర్శిగా ఎస్.దాసన్ జాడ్సన్, హరిత, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా హరిబాబులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా కన్వీనర్ శ్రీనివాసన్, కార్యదర్శి నిత్యపూజయ్య, జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, రాయచోటి కార్యదర్శి మహాదేవ, లక్కిరెడ్డిపల్లి ఎన్‌జిఒ అధ్యక్షులు బలరామరాజు, సహాధ్యక్షులు శివారెడ్డి నరసింహ పాల్గొన్నారు.

నూతన 4 తరగతి ఉద్యోగుల సంఘం కమిటీ సభ్యులు

గంజాయి ముఠాను కఠినంగా శిక్షించాలి
- సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గంజాయి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా వివిధ కళారూపాలతో ప్రజలను చైతన్య పరుస్తున్న యువకళాకారుడు పెంచలయ్య హత్యను సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. గూండాల దాడిలో హత్యకు గురైన పెంచలయ్య మృతి పట్ల సంతాపం ప్రకటించారు. హత్య చేసిన గూండాలను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్న పెంచలయ్య నెల్లూరు రూరల్‌లో ప్రజానాట్య మండలి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ, ఇటీవల కాలంలో విచ్చలవిడిగా పెరిగిపోయిన గంజాయి సంస్కృతికి వ్యతిరేకంగా ఆయన ప్రజలను చైతన్య పరచడానికి అనేక కళారూపాలను రూపొందించి, ప్రదర్శించారని, పోలీస్ శాఖ సహకారంతో కూడా కొన్ని కార్యక్రమాలు చేశాడని వివరించారు. గంజాయి బారిన పడకుండా యువతను చైతన్య పరుస్తున్నందున ఓర్చుకోలేని గంజాయి వ్యాపారం చేస్తున్న ముఠా ఈ అఘాయిత్యానికి పాల్పడిందని పేర్కొన్నారు. ఇలాంటి ముఠాలను కఠినంగా అణచివేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతుల మేలు కోరే ప్రభుత్వం : చైర్మన్

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

రైతుల మంచి కోరేది కూటమి ప్రభుత్వమని, జల జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ నీరు అందించేలా రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కృషి చేస్తున్నారని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మండలాధ్యక్షులు గండికోట సుధాకర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమాన్ని శనివారం రాయచోటి మండలం పేమ్మాడపల్లి గ్రామంలో టిడిపి రాయచోటి రూరల్ మండల అధ్యక్షులు గండికోట సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పేమ్మాడపల్లి టిడిపి శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ద్వారా ప్రతి రైతుదూ అందిన పథకాలను అడిగి తెలుసు కున్నారు. కులమతాలకు, పార్టీలకతీతంగా సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి యువనేత నారా లోకేష్ ప్రతి ఒక్కరికి సూపర్ సిక్స్ పథకాలు అందించారని వివరించారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ నివాస గృహాలు మంజూరు చేసేలా అధికారులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించినట్లు వారు తెలియజేశారు.

జిల్లాను కొనసాగించడం హర్షణీయం

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి కేంద్రంగా అన్నమయ్య జిల్లాను కొనసాగించాలనే నిర్ణయం హర్షణీయమని ప్రయివేట్ విద్యాసంస్థల రాష్ట్ర జెఎసి కన్వీనర్, జిల్లా సాధన సమితి సభ్యులు డాక్టర్ పాపిరెడ్డి మదనమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా నుంచి మదనపల్లెను విడదీసిన నిర్ణయం బాధాకరంగా ఉన్నప్పటికీ, రాయచోటి జిల్లా కేంద్రంగా కొనసాగుతుందనే విషయం సంతోషకరమని పేర్కొన్నారు. కొంతమంది రాయచోటి జిల్లా కేంద్రంగా నిలవదని దుష్ప్రచారం చేసినప్పటికీ, సిఎం నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం, రోడ్డు రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లె రామ్ ప్రసాద్ రెడ్డి సహకారంతో రాయచోటి తిరిగి జిల్లా కేంద్రంగా నిలబెట్టబడిందని తెలిపారు. ఈ సందర్భంగా సిఎంకు, మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కేంద్రం నిలబడడంపై అన్ని వర్గాల ప్రజలు, రైతులు, మేధావులు, యువత, విద్యార్థులు, పార్టీల కతీతంగా ప్రజలు అభినందనలు తెలుపుతున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమిని ప్రభుత్వపరం చేశాం : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

సంబేపల్లిలో ప్రయివేట్ వ్యక్తుల స్వాధీనం అక్రమంగా ఉన్న 18.80 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వ పరం చేశామని జెసి ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2024లో ప్రభుత్వ స్థలాలు ప్రయివేట్ వ్యక్తుల స్వాధీనంలో ఉన్న అంశంపై సంబేపల్లి తహశీల్దార్ ఇచ్చిన నివేదికపై సంయుక్త కలెక్టర్ కోర్టులో సమగ్ర విచారణ చేపట్టామని పేర్కొన్నారు. సంబేపల్లిలో 18.80 ఎకరాల ప్రభుత్వ భూమి గౌతమ్, శంకర్ నారాయణరెడ్డి, శివగంగ, ఉదయ్ కుమార్ రెడ్డిల స్వాధీనంలో అక్రమంగా ఉంచుకున్నారని, వారికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించనప్పటికీ అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారని ఇచ్చిన తహశీల్దార్‌పై విచారించామని చెప్పారు. ప్రభుత్వ స్థలం సదరు వ్యక్తుల ఆధీనంలో అక్రమంగా ఉంచుకున్నారని తేలిందన్నారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేసిన అప్పటి తహశీల్దార్‌పై శాఖ పరమైన చర్యలకు ఆదేశాలు జారీ చేసినట్లుగా ఆయన పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ స్థలాలను నిషేధిత జాబితాలో చేర్చామని, సదరు ప్రయివేటు వ్యక్తుల ఆక్రమణలన్నింటినీ ప్రభుత్వ పరం చేసుకునేలా చర్యలు చేపట్టాలని సంబేపల్లి తహశీల్దార్‌ను ఆదేశించినట్లుగా పేర్కొన్నారు.

విద్యార్థుల్లో ప్రాథమిక నైపుణ్యాలు అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి- రాయచోటి

విద్యార్థుల్లో నిపుణ్ భారత్ లక్ష్యాలు (పునాదిస్థాయి అక్షరాక్షిత సంఖ్య జ్ఞానం) సాధించడం ద్వారా వారి ప్రాథమిక విద్యాభ్యాసాన్ని మెరుగుపరచాల్సిన అవసరం ఉందని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ అసాదుల్లా పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మార్కెట్ స్ట్రీట్ మోడల్ ఫౌండేషన్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బోధన-అభ్యసన పద్ధతులను పరిశీలించి, విద్యార్థుల్లో చదువు-లెక్కల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఆటపాటల ద్వారా నేర్పించే పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం పెంపొందించడంలో తల్లిదండ్రులు, కమ్యూనిటీ భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని తెలిపారు. క్రమం తప్పకుండా తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి, గైర్హాజరు ఉన్న విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి, పాఠశాలకు సకాలంలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పాఠశాలలో రికార్డుల పరిశీలనతో పాటు, తరగతి గదుల్లో పాఠ్య బోధనను గమనించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి, వారి అభ్యాస స్థాయిలపై అవగాహన పొందారు. అంగన్వాడీ కేంద్రం కార్యకలాపాలను కూడా పరిశీలించి, ప్రీ-స్కూల్ స్థాయిలో పిల్లల ప్రాథమిక నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు నాగరాజు, ఎఫ్‌ఎం జిల్లా కో-ఆర్డినేటర్ రాజశేఖర్, అంగన్వాడి టీచర్ ఓబులమ్మ పాల్గొన్నారు.

బ్రాడ్‌బ్యాండ్ టెక్నీషియన్ కోర్సుపై శిక్షణ

ప్రజాశక్తి-రాజంపేట

న్యాక్ కేంద్రంలో బ్రాడ్ బ్యాండ్ టెక్నీషియన్ కోర్సుపై రెండు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నామని కోర్సు శిక్షకుడు గురయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన అనూసూచిత్ జాతి అభ్యుదయ యోజన ద్వారా ఈ కోర్సుపై శిక్షణ అందిస్తామని తెలిపారు. శిక్షణ సమయంలో మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం ప్రభుత్వంచే గుర్తింపబడిన సర్టిఫికెట్ మంజూరు చేసి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ఆసక్తిగల నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7989733065, 9550118382 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎస్ఆర్‌కె, చేగు ఫుడ్స్ కంపెనీలను పరిశీలిస్తున్న చిరంజీవి చౌదరి

పరిశ్రమల ఏర్పాటుకు సహకారం

- ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి

ప్రజాశక్తి-కలికిరి

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవిచౌదరి పేర్కొన్నారు. శనివారం కలికిరి సమీపంలోని ఎపిఐఐసి భూమి లో ఏర్పాటు చేసిన ఎస్ఆర్‌కె ఫుడ్స్, చేగు ఫుడ్స్ యూనిట్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఆర్‌కె ఫుడ్స్‌లో కొత్తగా ఏర్పాటు చేసే ఫుడ్ యూని ట్స్‌కు అవసరమైన ప్రభుత్వ సహకారాన్ని అందిస్తామన్నారు. ఇంకా ఎవ్వరైనా కొత్త పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చినట్లయితే వారికి పభుత్వం తరుపున అన్ని అనుమతులు త్వరగా వచ్చేటట్లు చూస్తామన్నారు. వారికి ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమం లో జిల్లా ఉద్యాన శాఖ అధికారిని సుభాషిణి, జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణ కిషోర్, ఉద్యాన శాఖ అధికారి సుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రామాపురం

దిత్వా తుపాన్ వల్ల పంటలు నష్టపోకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి నాగమణి పేర్కొన్నారు. మండలంలోని గువ్వలచెరువు కసిరెడ్డి గారిపల్లి గ్రామాల్లో శనివారం ఆమె రైతులతో కలిసి వరికోత అనంతరం ధాన్యాని పరిశీలించి తగు జాగ్రత్తలు చూపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి కోత అనంతరం ధాన్యాన్ని ఎత్తు ప్రదేశంలో నిలువ చేసుకుని టార్పాలిన్ పట్టలతో కప్పించుకోవాలన్నారు. ద్విత్వా తుఫాన్ ప్రభావం వల్ల రెండుమూడు రోజులు వర్షాధికంగాపడే సూచనలు ఉన్నందువల్ల వరి కోత పనులు నిలిపివేలన్నారు. పంట కోత అయినా ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్తలు భద్రతపర చుకోవాలన్నారు. పంటకోయని వరి మడులలో నీరు నిల్వ ఉండకుండా కాలువలు గట్లు కొట్టివేయాలన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి తగిన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు.

కంచన శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రవాసాంధ్రులు

ఘనంగా 'కంచన' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-సుండుపల్లి

గల్ఫ్ జనసేన జాతీయ కన్వీనర్ కంచన శ్రీకాంత్ జన్మదిన శనివారం వేడుకలను కువైట్‌లోని ఫరవానియానౌషాద్‌హోటల్‌లో జనసైనికులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కువైట్‌లోని ప్రవాసాంధ్రులు కులమతాలలు, పార్టీలకు అతీతంగా హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో సుగవాసి యువసేన అధ్యక్షుడు కంచన రెడ్డిశేఖర్ ఎన్ఆర్ఐ టిడిపి మిత్ర బృందం సభ్యులు రషీదా, సాయిబాబా, నగేష్ బలరాం, జిలాన్, మూర్తి, జబీర్, రాజు, శివ, జలీల్, సదాశివ, అర్షద్, టిడిపి పాల ఏకిరి అధ్యక్షుడు శ్రీహరి నాయుడు హజరైనట్లు తెలిపారు.

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

పరిసరాలను శుభ్రంగాఉంచుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారని ఎంపిడిఒ బాపూజీ పట్నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రశేఖర్, కార్యదర్శి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం, జూనియర్ కళాశాల వద్ద శనివారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పచ్చదనం-పరిశుభ్రత కార్యక్ర మం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా నాలుగవ రోజు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ, కళాశాల ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపుల వల్ల పిల్లల్లో సేవాభావం పెంపొందుతుందన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు :అంగన్వాడీ, ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా రైల్వే కోడూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ ఎస్.రేణుక తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని కోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట మండలాలలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు అర్హతలు కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారులు డిసెంబరు 7వ తేదీ సాయంకాలంలో గా ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని పూర్తి వివరాలు ఐసిడిఎస్ కార్యాలయంలో సంప్రదించవలసిందిగా సిడిపిఒ తెలిపారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

పాఠశాలకు మైక్‌సెట్ అందిస్తున్న మురళి

మండల పరిధిలోని రెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలకు మాజీ సర్పంచ్ కీ.శే.రొం పిచర్ల ఆదినారాయణ జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు పి4 కింద మైక్ సెట్, స్టీల్ వాటర్ బాటిళ్లు, నోటుపు స్తకాలు, పెన్నులు, పెనిళ్ల పాఠశాలకు వితరణగా ఇచ్చారని హెచ్ఎం ప్రగతి పేర్కొన్నారు. ఉదయం ప్రార్థన సమావేశానికి, పాఠశాల సమావేశాలు జరిగినప్పుడు మాట్లాడటానికి పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యాసామగ్రిని ఇవ్వడం వల్ల విద్యార్థులు చదువుకో వడానికి, రాసు కోవడానికి వీలుగా ఉంటుందన్నారు. అనంతరం రొంపిచర్ల మురళి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడు ముందంజలో ఉంటామని విద్యార్థులకు ఎలాంటి సహాయం అవసరమైన చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. గ్రామస్తులు ప్రహరీ గోడకి సంబంధించి సమస్యను తీసుకురావడం జరిగిందని, తక్షణమే దీనిపై కలెక్టర్ తో మాట్లాడి పరారీ గోడ నిర్మించడానికి గ్రామస్తులకు తెలిపారు. ఈ పాఠశాలకు మండలంలో మంచి పేరు ఉందని దీనిని కొనసాగించాలని దానికి కావాల్సిన సహాయ సహకారాలు అందిం చడంలో ముందుంటామ పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొ న్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE [SENIOR DIVISION] MADANAPALLE

I.A. No. 274 /2025 in
I.A. No. 329/2020
O.S. No. 274 /2009

N.Sreedevi and others. ...Petitioners
Vs
N.Sreedevi and others. ...Respondents

NOTICE TO SECOND RESPONDENT

R. SREEVANI d/o M. Maheswari Devi, aged 42 years, business, residing at 14/31, CTM road, Madanapalle.

Please take notice that the above matter stands posted to 05-12-2025 for your appearance either in person or through an Advocate at 10-30 am before the Hon'ble Court and to answer all points raised in the above proceedings, failing which the matter will be decided ex-parte.

//By Order of the Court//

BATHINI NAGAMAL REDDY
Advocate for Petitioners

ఉత్సాహంగా ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

నందలూరు : క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డిఇఒ నాగయ్య

ప్రజాశక్తి-నందలూరు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలు మండలంలో ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగాయి.రాయచోటి డిప్యూటీ డిఇఒ ఎల్.నాగయ్య, ఎంఇఒ-2 అనంత కృష్ణ, నాగిరెడ్డిపల్లి జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, క్రీడల మండల కో-ఆర్డినేటర్ గౌరీల ఆధ్వర్యంలో ఈ పోటీలు అరవపల్లి మైదానంలో జరిగాయి.క్రికెట్ జట్టుకు 16 మంది ఉపా ధ్యాయుల బృందం, త్రోబాల్ జట్టుకు 12 మంది మహిళా ఉపాధ్యాయులు ఎంపిక య్యారు. వీరు తదుపరి డివిజన్ స్థాయిలో జరిగే క్రీడా పోటీలలో మండలం తరపున పాల్గొననున్నారని మండల కో-ఆర్డినేటర్ గౌరీ తెలిపారు.

చిన్నమండెం: ఉపాధ్యాయుల్లో శారీరక, మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాల పెంపుదల లక్ష్యంగా మండలం పరిధిలో ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా క్రీడలు నిర్వహించారు. ఎపి మోడల్ స్కూల్ క్రీడా మైదా నంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో ఉపాధ్యా యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయుల కోసం నిర్వ హించిన ఈ క్రీడల్లో విజేతలను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఎంఇఒ-1 శివనాయక్, మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ వీరాంజ నేయులు తెలిపారు. కార్య క్రమం విజయవంతంగా సాగేందుకు సహకరించిన మండల ఉపాధ్యా యులకు, నిర్వాహ కులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా జడ్‌పిహై స్కూల్(బాలికలు) ప్రధానోపాధ్యాయులు వెంకట్రా మిరెడ్డి, జడ్‌పిహైస్కూల్(ఉర్దూ) ప్రధానోపాధ్యాయులు సాం బశివ, అన్ని ఉన్నత పాఠశాలల పీడీ, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది, మురళీమోహన్ రాజు, మస్తాన్ వలీ ఖాన్ పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** ఉపాధ్యాయులకు నిర్వహించిన క్రీడా పోటీలలో మండలంలోని ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నట్టు ఎంఇఒలు పద్మా వతి, నారాయణ తెలిపారు. జడ్‌పి హైస్కూల్ (తెలుగు) క్రీడా మైదానంలో నిర్వహించిన క్రీడా పోటీలను తహశీల్దార్ తపస్విని ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారన్నారు. ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన మండలస్థాయి క్రికెట్, త్రో బాల్ పోటీలలో విజేతలుగా నిలిచిన వారిని డివిజన్ స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించడానికి సహకరించిన ఉపాధ్యాయులకు, నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్ఎం ఎ.అపర్ణా దేవి, శ్రీనివా సులురెడ్డి, యుటిఎఫ్ నాయకులు నాదిర్‌షావల్లి, మండలంలోని ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, యూనియన్‌నాయకులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మండల ంలో మండలస్థాయి ఉపాధ్యాయ క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించినట్లు ఎంఇఒ ఆర్.రెడ్డి శేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యా యుల శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసము, క్రీడా స్ఫూర్తి, ఉపాధ్యాయుల మధ్య చక్కటి సహకారం, అవగాహన, క్రమశిక్షణ పెంపొందడానికి క్రీడలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో బాలుర పాఠశాల ప్రధానోపాధ్యా యులు భువనేశ్వరి మాట్లాడుతూ మానసిక ఒత్తిడి తగ్గించడానికి, టీమ్ స్పిరిట్, నాయకత్వ లక్షణాలకు క్రీడలు ఎంతో దోహద పడతా యన్నారు.

చిన్నమండెం : వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంఇఒ శివానాయక్

నిమ్మనపల్లి : త్రోబాల్ పోటీలను ప్రారంభిస్తున్న తహశీల్దార్ తపస్విని

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరం : జడ్జి

మాట్లాడుతున్న జడ్జి ఉమర్‌ఫరూక్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తంబ ళ్లపల్లె జెసిజె కోర్టు జడ్జి ఉమర్‌ఫరూక్ అన్నారు. శనివారం ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పా టుచేసి పిల్లలకు న్యాయపరమైన చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, 18 సంవ త్సరాల లోపు బాలికలకు వివాహం చేస్తే చట్టరీత్యా శిక్షార్హులు అవుతా రన్నా రు. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల వారిలో శారీరక, మానసిక రుగ్మతలు ఏర్పడి జీవితం చిన్నాభిన్నం అవుతుందన్నారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసు కోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. న్యాయసేవా సంఘం ద్వారా ఉచితంగా న్యాయ సల హాలు అందిస్తారని తెలిపారు.విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు ఎద గాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రాజంపేట

సిఎం సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మీ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని సిఎం సహాయనిధి మంజూరైన బాధితులు నివాసమున్న గ్రామాలకు వారి ఇంటి దగ్గరే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులకు చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందన్నారు. టి.కమ్మపల్లి గ్రామానికి చెందిన గుండపనేని వెంకటేశ్వర్లకి రూ.40వేలు వెంకటయ్యనాయుడుకు రూ.25,166, కాపెర్ల వెంకట సుబ్బమ్మకు రూ.32,028, ఎగువ రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుప్పాల సంపూ ర్ణకు రూ.59,800, రంగంపల్లి పంచాయతీ గొల్లపల్లి గ్రామానికి చెందిన గాడి వెంకటసుబ్బారెడ్డికి రూ.64,041 పంపిణీ చేసినట్లు తెలిపారు. రంగంపల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి వసంత కుమార్ రెడ్డికి రూ.30వేలు, గారాల మడుగు పంచాయతీ మల్లోరపల్లి గ్రామానికి చెందిన దేవ్ రమాదేవికి రూ.37,142లు, కొత్తపేట గ్రామానికి చెందిన రెంటాల విమలమ్మకు రూ.37,803 , పివిజి పల్లి పంచాయతీ కొండంపల్లి గ్రామానికి చెందిన రెడ్డిపాక పెంచలయ్యకు రూ.30వేలుఉ, అందించినట్లు చెప్పారు. అనంత య్యగారిపల్లి గ్రామానికి చెందిన ఆకుల నారాయణకి రూ.30వేలు, జాగువా రిపల్లి గ్రామానికి చెందిన ఆలూరు యానాదమ్మకి రూ.30,786 , వత్తలూరు గ్రామపంచాయతీకి చెందినమధుసూదన్‌రెడ్డికి రూ.50 వేలు, భావికాడపల్లి ఎగవపల్లి గ్రామానికి చెందిన బండి రాజేశ్వరమ్మకు రూ.44,479, బావికాడపల్లి పంచాయతీ రామాపురం దళితవాడకుచెందిన వెంకటరమణాకి రూ.50,466ల చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరు కూడా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే సిఎం చంద్రబాబు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు సిఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్,వరలక్ష్మి

ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

ప్రాంగణ ఎంపికల్లో 95 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

స్థానిక పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థచే ప్రాంగణ ఎంపికలు జరిగినట్లు కళా శాల ప్లేస్మెంట్ ఆఫీసర్ సి.మనోజ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా అయ న మట్లాడుతూ వివిధ విభాగాల నుంచి 95మంది విద్యార్థులు రూ.3.6 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైనట్లు టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థ సభ్యులు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్. డాక్టర్ ఎస్. రామ లింగారెడ్డి అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరో హించి తల్లిదండ్రులకు, కళాశాలకు గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయుడు విద్యార్థులను అభినందిం చారు. కార్యక్రమంలో విభాగాధిపతులు,అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

'మిట్స్'లో సమగ్ర శిక్షణపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

స్థానిక మిట్స్ యూనివర్సిటీలో ఎంసిఎ విభాగం ఆధ్వర్యంలో 'ఫుల్ స్టాక్ వెబ్ డెవలప్‌మెంట్' అనే అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారని విసి యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నైలోని విఐటి, వేలూరులో స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫర్మే షన్ సిస్టమ్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ తనపాల్ పాల్గొ న్నారని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ తనపాల్ మాట్లాడుతూ ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్ అనేది ఒక ఇంటర్నెట్ అప్లికేషన్‌లో ఫ్రంట్ ఎండ్ యూజర్ చూసే భాగం, బ్యాక్‌ఎండ్‌లో డేటాబేస్, సర్వర్, లాజిక్ వంటి రంగాల్లోనూ పనిచేయగల సాంకేతికతని తెలిపారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఈ నైపుణ్యానికి భారీ డిమాండ్ పెరగడం ద్వారా ఫుల్ స్టాక్ డెవలపర్లు ఫ్రంట్ ఎండ్, బ్యాక్‌ఎండ్ రెండింటినీ నిర్వహించగలగడం వల్ల టీమ్‌పై ఆధారపడటం తగ్గి, ప్రాజెక్ట్ నిర్వహణ వేగంగా పెరుగుతోందన్నారు. విద్యా ర్థులకు ఎండ్-టు-ఎండ్ ప్రాజెక్ట్ అవగాహన ఉండటం వల్ల ఒక అప్లికేషన్ ఎలా రూపుదిద్దుకుంటుంది, డేటా ఎలా ప్రాసెస్ అవుతుంది, యూజర్‌కు ఎలా కనిపిస్తుందన్నది పూర్తిగా అర్థమవు తుందన్నారు. ఐటి రంగంలో కెరీర్ నిర్మించాలనుకునే విద్యార్థులు ఈ నైపుణ్యాన్ని తప్పనిసరిగా అలవర్చుకోవడం చాలా ముఖ్యమని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ ఎన్.నవీన్ కుమార్, కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసన్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి-కలికిరి

ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని కెవికె కో-ఆర్డినేటర్ మంజుల పేర్కొ న్నారు.ఈనెల 24 వ తేది నుంచి 29వ తేది వరకు అన్నమయ్య జిల్లాలోని వివిధ మండలాల్లోని గ్రామాల్లో నిర్వహించిన రైతన్నా.మీకోసం కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖలతో కలిసి పాల్గొన్నారు. రైతులకు వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వివిధ సూచనలు చేశారు. రైతులు వరిలో సేంద్రియ పద్ధతులైన పశువుల ఎరువు, జీవన ఎరువులు, అజోల్లా, వేప సంబంధిత మందుల పిచికారిని ఉపయోగించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. పంట పొలాల్లో నీటి సంరక్షణ, నీటిపారుదల పద్ధతుల గురించి తెలిపారు. రైతులు వివిధ పంటలైన చామంతి, బంతి, వంగ, బెండ, సంపంగి మరియు ఇతర పంటల వైపు సాగు చేసేలా చూడాలని తెలిపారు. వివిధ పంటల్లో రసాయని ఎరువులు పురుగుమందులు తగ్గించి జీవన ఎరువులు, సమగ్ర యాజమాన్య పద్ధతులు ఆచరించి లాభం పొందవచ్చునని డాక్టర్ వై. పీరు సాహెబ్ తెలిపారు. రైతులు తుపాన్‌తోఅప్రమత్తంగా ఉండి పంటల రక్షణకు వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు.

ఎపిఎన్‌జిఒ తాలుకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి-పీలేరు

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ పీలేరు తాలూకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించినట్లు ఎన్నికల అధికారి కె.బలరామరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం స్థానికంగా జరిగిన ఈ ఎన్నికల్లో పీలేరు తాలూకా అధ్యక్షులుగా రెడ్డెప్ప నాయుడు, కార్యదర్శిగా, వెంకటరమణలతో పాటు మరో 12మంది సభ్యులను ఏక గ్రీవంగా ఎన్ను కున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి కడపజిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్‌యాదవ్, జిల్లా అధ్యక్షులు ఎం.వేణుగోపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నిత్యపూజయ్య, కన్వీనర్ శ్రీనివాసన్, పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలియ జేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నాగేశ్వర్, రాయచోటి కార్యదర్శి మహదేవ, డివి శివారెడ్డి, ఉపాధ్యక్షులు హరి పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ఫైనల్స్‌కు చిత్తూరు జట్టు

ప్రజాశక్తి-కలికిరి

అండర్-14 హ్యాండ్ బాల్ పోటీలలో చిత్తూరు జట్టు అత్యుత్తమ ప్రతిభ చాటి ఫైనల్స్‌కు చేరింది. కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగు తున్న జిల్లా హ్యాండ్ బాల్ బాల బాలికల పోటీలలో రెండవ రోజు బాలికల చిత్తూరు, కడప జట్టుల మధ్య జరిగిన పోటీలో 2-0 తేడాతో చిత్తూరు అండర్-14 బాలికల జట్టు గెలుపొంది సెమీఫైనల్స్ కు అర్హత సాధించింది. బాలుర క్వార్టర్ ఫైనల్‌లో విభాగంలో చిత్తూరు జట్టు కృష్ణజిల్లాపై గెలుపొంది సెమీఫైనల్స్‌కు అర్హత సాధించింది. అనంతరం సెమీఫైనల్స్‌లో చిత్తూరు నెల్లూరు జట్టుపై అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 13-8 తేడాతో గెలుపొంది ఫైనల్స్ కి చేరుకుంది. రెండో రోజు జరిగిన పోటీల్లో స్కూల్ గేమ్స్ సెక్రటరీలు వై.నాగరాజు, ఝాన్సీలు, డిటి సయ్యద్, ఎఎస్ఐ నరసింహులు క్రీడాకారులను అభినందించారు కార్యక్రమంలో స్టేట్ అబ్జర్వర్ బి వెంకటేశ్వరరావు, బోర్డ్ బాబి, పీడీలు కోచ్‌లు, క్రీడాకారులు, పోలీస్ సిబ్బందిపాల్గొన్నారు.

జిల్లా ప్రకటన సమాచారాన్ని నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తున్న సర్పంచ్

జిల్లా ప్రకటనతో అభివృద్ధి వేగవంతం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రభుత్వం మదనపల్లెను జిల్లాగా ప్రకటిస్తూ మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేయ డంతో అభివృద్ధి మరింత వేగవంతంగా జరుగుతుందని సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం స్థానిక సచి వాలయం వద్ద మదనపల్లె జిల్లా ప్రకటనకు సంబంధించిన సమాచారాన్ని నోటీస్ బోర్డులో పంచాయతీ అభివృద్ధి అధికారి రెడ్డి ప్రసాద్‌తో కలిసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మదనపల్లె ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ మదనపల్లెను జిల్లా చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎంతో చారిత్రాత్మక ఘనతను కలిగిన మదనపల్లె జిల్లా కావడంతో ఈ ప్రాంతం అభివృద్ధిలో మరింత ముందుకు సాగుతుం దన్నారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో మదనపల్లె ఉండడంతో ఈ ప్రాంతం విద్య, వాణిజ్య, వైద్య, వ్యాపార, ఉద్యోగ, వ్యవసాయ వంటి రంగాలలో అభివృద్ధి చెంద డం ఖాయమన్నారు. జిల్లా ప్రకటన సమాచారాన్ని సచివా లయాల ముందు ప్రజల సమాచారం కొరకు ప్రదర్శించామన్నారు. కార్యక్రమంలో పంచా యతీ అభివృద్ధి అధికారి రెడ్డిప్రసాద్, సచివాలయ ఉద్యోగులు గణేష్, మమత పాల్గొన్నారు.

డిపాజిట్లపై అధిక వడ్డీ

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని తిమ్మసముద్ర గ్రామపంచాయతీలో రైతు సేవ సహ కార సంఘం ద్వారా డిపాజిట్లకు అధిక వడ్డీని ఇస్తామని రైతు సేవ సహకార సం ఘం ఎండి కె.రెడ్డిబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సం ఘ సభ్యులకు సత్వరమే పంట రుణాలు సదుపాయం కల్పిస్తామని, తక్కువ వడ్డీకే బంగారు ఆభరణాలపైన రుణాలు అందిస్తామన్నారు. దీర్ఘకాలిక రుణాలపైన గరిష్టంగా రూ.20లక్షల వరకు రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రుణా లు ఇస్తామన్నారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సకాలంలో రుణాలు అందేలా కృషి

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని సోంపల్లి సింగల్ విండో ద్వారా రైతులకు సకాలంలో రుణాలు ఇచ్చి అభివృద్ధి పరుస్తామని సోంపల్లి సింగల్ విండో చైర్మన్ గుత్తికొండ త్యాగరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సోంపల్లి ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే వ్యవసా యానికి సంబంధించిన ఎరువులు, విత్తనాలు, సహకార రుణాలు అందిస్తా మన్నారు. మదనపల్లె డిసిసిబి బ్యాంక్ రైతులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో తెచ్చిందన్నారు. బకాయిలు ఉన్న రైతులు రుణాలు చెల్లించి తిరిగి రుణాలు పొందాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతులు అభివృద్ధి కోసం అన్ని విధాల భరోసా కల్పిస్తాం దన్నారు రానున్న రోజుల్లో రైతులకు మరికొన్ని సౌకర్యాలు అందుబాటులో తీసుకు వస్తామన్నారు. కార్యక్రమంలో మదనపల్లె డిసిసిబి మేనేజర్ స్వర్ణలత, సూపర్వైజర్ వెంకటర మణ, నాయకులు కెవి.రమణ, రమ ణారెడ్డి, శివారెడ్డి, సుబ్బినాయుడు, రాము, మౌలా సాహెబ్, గంగాదేవి ఉన్నారు.

ఎగువరెడ్డిపల్లెలో వీధిదీపాలు ప్రారంభం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి మెయిన్ రోడ్డు నుంచి ఎగువరెడ్డిపల్లి వరకు విద్యుత్ వీధి దీపాలను ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మీ ప్రారంభించారు. ఎఇ కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ తీగలను అమర్చి ప్రారంభింప జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీధిదీపాల ఏర్పాటుకు సహకారం అందించిన దాత రిటైట్ టీచర్ కుప్పాల రామకృష్ణయ్యను, ఆయన తనయుడు శివశంకర్ ను అభినందించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, ఎక్స్ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రయ్య నాయుడు, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, సింగమాల సాయిగిరీష్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, జికె.సుబ్బారెడ్డి, తిప్పాయిపల్లి భార్గవ్, సుబ్బరాయుడు నాయుడు, వెంకటాద్రి నాయుడు, శ్రీరాములునాయుడు, యూనిట్ ఇన్‌ఛార్జి అణపాల చంద్ర, పోలు ప్రేమ కుమార్, సింగమల రెడ్డయ్యరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడల్లో సత్తా చాటిన విభిన్న ప్రతిభావంతులు

ప్రజాశక్తి-పీలేరు

జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారని ప్రధానోపాధ్యాయులు డాక్టర్ జైపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ప్రధాన ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పారా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన క్రీడల్లో తమ ఉన్నత పాఠశాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు పలు పోటీల్లో విజేతలుగా నిలిచారన్నారు. 100 మీటర్ల పరుగు పందెంలో ఎస్ ఆయేషా, షాట్ పుట్‌లో జ్ఞానశేఖర్, లాంగ్ జంప్‌లో లిఖిత్ చక్కటి ప్రతిఫలం చూపి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి బహుమ తులు అందుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలిత కుమారి, ప్యారూ ఖాన్, శ్రీరాములు, జయరాం నాయక్, భాస్కర్, హేమలత పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-రాజంపేట

మండల పరిధిలోని కొత్త బోయినపల్లి పిఎంశ్రీ ఎస్‌జెఎస్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు భద్రతా అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రూరల్ సిఐ ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శక్తి కో-ఆర్డినేటర్ జమానుల్లా ఖాన్, కల్పన, రవి, వాసు, శక్తి టీమ్ సభ్యులు పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేందుకు శక్తి యాప్‌ను డౌన్ లోడ్ చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే వీడియో కాల్స్‌పై, లోన్ యాప్‌ల మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, బాల్య వివాహాలు, పోక్సో చట్టం గురించి వివరించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు పోలీసుల సహాయం కోసం 112 లేదా సైబర్ నేరాల కోసం 1930 హెల్ప్‌లైన్ నంబర్‌లను ఉపయోగించాలని సూచించారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చట్టాలపై అవగాహన ఉంటే ఎటువంటి సమస్యనైనా చక్కగా ఎదుర్కొనవచ్చని చెప్పారు. విద్యార్థి దశ నుంచే చట్టాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భారతి, ఉపాధ్యాయులు మొలక ఓబులేసు, పుత్త జనార్ధన్, పారా శ్రీరాములు, బి.శేషగిరి, ఎస్.వి.రామరాజు, శివప్రసాద్ గౌడ్, ఎస్.ప్రభాకర్‌రావు, చెన్నకేశవులు, విజయ బాస్కర్, అనిల్ కుమార్, ఎన్.రాజయ్య, అమరావతి, సువర్ణ సుందరి, మధుర వాణి, దార్ల శ్రీనివాసులు ఆచారి పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలు అవాస్తవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతిపై అవిశ్వాస తీర్మానం ఎదుర్కొన్న వైస్ సర్పంచ్ భారతి చేసిన ఆరోపణలు అవాస్తమని వార్డు మెంబర్లు గొంగడి కృష్ణమూర్తి, నాగరాజు అన్నారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి చలపతి విజయం సాధించారని, ఆయనతోపాటు వార్డు మెంబర్లను గెలిపించుకున్నారని గుర్తుచేశారు. అప్పట్లో భారతిని ఉప సర్పంచ్‌గా నియమించి మహిళలకు సముచిత స్థానం కల్పించారన్నారు. నిరంతరం పంచాయతీ అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం పనిచేసే చలపతిపై దుష్ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. అనంతరం మరో వార్డు మెంబర్ నాగరాజు మాట్లాడుతూ కురవంక పంచాయతీకి నిధులు లేకున్నప్పటికీ సొంత నిధులతో పంచాయతీలోని ప్రజల సమస్యలను చలపతి పరిష్కరించారన్నారు. ఉపసర్పంచ్ భారతి నిజంగా వారం రోజుల క్రితం రాజీనామా చేసుంటే సబ్ కలెక్టర్ అవిశ్వాస తీర్మానానికి ఎందుకు హాజరయ్యారని ప్రశ్నించారు. కార్య క్రమంలో వార్డుసభ్యులు అనిత, శ్రీనివాసులు, చంద్రిక, ప్రజలు పాల్గొన్నారు.